# పక్కనున్న తిరుపతి

పుణ్యక్షేత్రాలూ, చారిత్రాత్మక స్థలాలూ మనం వున్న వూరికి పక్కనే వుంటాయి. ఇవ్వాళ వెళదాం, రేపు వెళదాం—అని వాయిదాలు వేసుకుంటూ వుంటాము. ఏళ్ళ తరబడి అక్కడే వుంటాము గాని పక్కనేవున్న ఆ పుణ్యక్షేత్రాన్నో, చారిత్రాత్మక స్థలాన్నో చూడము.

ఏలూరులో ఎన్నేళ్ళో ఉన్నాం, కాని పెదవేగి చూడలేదు. (పెదవేగిలో ప్రస్తుతం ఏమీ లేకపోవచ్చు; ఒకప్పుడు వేంగిరాజులు ఉండేవారుగా!) బళ్లారిలో మూడేళ్ళుఉన్నాం; కాని శిథిలాంధ్ర వైభవానికి చిహ్నమయిన హాంపీని సందర్శించలేక పోయాము. రాజమండ్రిలో ఏడాదిన్నర ఉన్నాము; భద్రాచలంగానీ, కోనసీమగానీ వెళ్ళడం పడలేదు. విశాఖపట్నంవెళ్ళి, సింహాచలం చూడలేదు. మద్రాస్ వచ్చిన మూడేళ్ళదాకా మహాబలిపురం వెళ్ళడమే పడలేదు. ఇక తిరుపతి మాట చెప్పాలా?

తిరుపతి వెళ్ళేందుకు మాకు మొక్కులూ, గిక్కులూ లేవు. శాంతాదేవికీ, నాకూ ఉన్న భగవద్భక్తి కూడా అంతంతే! అసలు దేవుడనే వాణ్ణి గురించి మాకు వున్న అభిప్రాయాలు పైకి చెప్పడం కంటే, లోపల దాచుకోవడమే మేలు. దేవుడిమాట అటువుంచి, పక్కనున్న తిరుపతి చూడకపోతే, పదిమందీ మేమేదో తప్పుచేసినట్టు 'అదేమిటర్రా'

అంటారు. అయినా మేమంత లక్ష్యపెట్టమనుకోండి. తిరుపతి వెళ్తే బావుంటుందనిపించేది గాని, తిరుపతి వెళ్ళితీరాలని ఏనాడూ ఘట్టిగా అనిపించలేదు.

ఒకరోజు సాయంత్రం ముకుందంగారు పిచ్చాపాటీ మాట్లాడుతూ, తానా రాత్రి ఎవరో ఫిలిమ్ ఫ్రెండ్స్‌తో తిరుపతి వెళ్తున్నానన్నాడు.

"మున్నూటఅరవైరోజులూ బ్రహ్మాండంగా ఉంటుందటగా అక్కడ! ఎప్పుడైనా తీరిక చేసుకు వెళ్ళాలి." అంది శాంతాదేవి.

"తిరుపతిలో ఏముంటుందండి-బోడిగుళ్ళు" అని నవ్వారు ముకుందరావుగారు.

"మరి మీరెందుకు వెళ్తున్నారు?" అని రెట్టించింది శాంతాదేవి.

"నేనా? మా వాళ్ళు డబ్బాలు పట్టుకు పోతున్నారు. రాత్రి చల్లబాటువేళ ప్రయాణం గదా, దారిలో ఖబుర్లు చెప్పుకుంటూ వుండవచ్చునని నన్ను రమ్మన్నారు."

"డబ్బాలేమిటి?" అన్నాను.

"ఫిలిమ్ డబ్బాలు"

"ఎందుకు?" అంది శాంతాదేవి ఆశ్చర్యపోతూ. నాకూ వింతగానే ఉంది. ఫిలిమ్‌ని ప్రజలకి చూపబోయేముందు సెన్సార్ అంటూ ఒకటి ఉంది; సెన్సార్ ఆఫీసరు అంటూ ఓశాయన ఉంటాడు. ఆయనకి మొట్టమొదటచూపి, ఆయన

దగ్గర్నుంచి అనుమతి పత్రం పొందనిదే ఫిలిమ్‌ని ప్రజలకి చూపకూడదనే నిబంధన ఒకటి అమలులో ఉన్నట్టు నాకు తెలుసు. అంతేగాని, మన సెక్యులర్ ప్రభుత్వం ప్రతి సినీమా చిత్రమూ తిరుపతి దేవుడి దగ్గిర అభిషేకం చేసుకురావాలని అనగలుగుతుందా అని తెల్లబోయాను.

మా అజ్ఞానాంధకారాన్ని పోగొట్ట గలిగే కొన్ని ఘన మైన విషయాలు చెప్పారు ఆ వేళ ముకుందంగారు. ప్రతి తారా తనకి ఎక్కువ బుకింగ్స్ రావాలనీ, ప్రతి నిర్మాతా తన చిత్రం గేట్లు పగలగొట్టాలనీ తిరుపతివెళ్ళి ఆ దేవుడి దగ్గర ప్రయివేటుగా ప్రార్థేయ పడతారట. ఒక నిర్మాత తిరుపతి ప్రయాణంలో కారుని బోల్తాగొట్టించి పరమపదించ డంవల్ల ఆ చిత్రానికి లక్షలు కురిశాయట. (ఇది ఒకమూదిరి 'హారాకిరి' అంది శాంతాదేవి; మృతులైనవారు దేవుడితో సమానం గనక వేళాకోళం చెయ్యకూడదని వారించాను నేను.) చాలా మంది నిర్మాతలు ఫిలిమ్ డబ్బాలకి ముందు తిరుపతిలో అర్చనా వగైరాలు చేయించనిదే, తెలుగు దేశంలో రిలీజ్ చెయ్యరట. అభ్యుదయగాముల మనుకునే నిర్మాతలు రాత్రివేళ రహస్యంగా మూడోకంటివాడికి తెలీ కుండా తిరుపతి వెళ్ళివస్తారనీ, జానపద చిత్రాలు తీసేవారు పబ్లిగ్గా పదిమందితోను చెప్పి ఏడుకొండల వాడిని సేవించి వస్తారనీ, ముకుందంగారు చెప్పారు. శాంతాదేవికీ, నాకూ ఒక రకంగా మతిపోయింది.

"మీ కిదంతా కొత్తగా ఉండికదూ! మన దేశంలో ఎంత మూఢత్వం లేదూ; అందులో యిది ఎన్నో భాగం?" మమ్మల్ని సముదాయించడం కూడా తన బాధ్యత అన్నట్టుగా మాట్లాడారు ముకుందంగారు.

"ఇన్నాళ్ళబట్టీ ఏమిటో అనుకున్నాను. నేను చచ్చినా తిరుపతి పోను" అంది శాంతాదేవి.

"అంత పట్టుదల ఎందుకులెండి!" అన్నారు ముకుందం గారు.

"మన యాత్రా స్థలాలన్నీ యింతే. మూఢుల మూఢత్వాన్ని పెంపొందించేందుకు సాయపడుతున్నాయి. తమ మేధాసంపత్తిని గాక తిరుపతి దేవుడిని నమ్ముకునే ప్రొఫెసర్లు మనవాళ్ళకి యివ్వగలిగే విజ్ఞానంగానీ, సందేశంగానీ ఏముంటుంది చెప్పండి, ముకుందంగారూ!"

ఆయన నవ్వుకున్నారు. శాంతాదేవి సూటిగా ప్రశ్నించింది. అంత నిలవదీసి అడిగితే ఎవరుమాత్రం ఏమి చెప్పగలరు? తిరుపతిచూడాలని మాకు అంతరాంతరంలో ఏ మాత్రమైనా వున్నా, ఆ నాటితో అది పూర్తిగా పోయింది.

◆ ◆ ◆

రాజారావు సాయంత్రం ఎక్స్‌ప్రెస్‌లో దిగి, ఆ రాత్రే తిరుపతి ప్రయాణమన్నాడు.

"తిరపతా, తిరపతి ఎందుకు?" అని విరగబడి నవ్వింది శాంతాదేవి. ముగ్గురం ఆమె తయారుచేసిన బిస్కెట్లలాటివి తింటూ, టీ తాగుతున్నాము.

"రెండు రోజులు—సరదాగా వెళ్ళివద్దాం. రెండంటే రెండేరోజులు," అని మనవి చేసుకుంటున్నట్టు మాట్లాడాడు రాజారావు. రాజారావెవరో చెప్పలేదు కదూ! శాంతాదేవి అన్నగారు.

"నువ్వు వెళ్ళిరా. మేమెందుకు తిరుపతి-దండగ చేటు. వచ్చేటప్పుడు గుండు కొట్టించుకువస్తే, మా యింట్లోకి రానివ్వను."

ఎంతయినా, అన్నగారిని అంత దురుసుగా అనకూడదని శాంతాదేవిని మందలించబోయాను.

"మహా ఆపేక్ష! పోనీ, మీ యిద్దరూ వెళ్ళండి. ఇద్దరూ చెరొక గొడుగూ కొనుక్కొని మరీ వెళ్ళండి."

"గొడుగు లెందుకు?" అన్నాడు రాజారావు, అర్థంగాక.

"బెజవాడ కనకదుర్గ దగ్గిరవున్నవాడివి నీకేం తెలును తిరుపతి గొడుగుల సంగతి?"

శాంతాదేవికి మహా తెలుసునా యేమిటి? చైనా బజారులో రెండు గొడుగులు కొనుక్కొని, అవివేసుకు వెళ్ళడమనుకుంది తిరుపతి గొడుగులంటే! దానికి చాలా తతంగం ఉండి వుంటుంది. అది మళ్ళీ ముకుందంగారిని అడిగితేగాని తెలియదు. ముకుందంగారు మాపాలిట 'ఎన్ సైక్లోపిడియా ఆంధ్రానికా' అవుతున్నారీమధ్య.

రాజారావు ఉద్యోగరీత్యా సింగపూరు వెళ్ళాలి, ఓడ మీదనో, విమానంమీదనో సింగపూరు వెళ్ళడానికి ముందు,

తిరుపతి వెళ్ళి, స్వామివారికి అర్చన చేయించి, దిబ్బెనలో వెయ్యవలసింది వేస్తేగాని మీాదు గట్టినది విప్పడానికి వీలు వుండదు. అంతవరకూ తల్లి శనివారాలు తప్పవు. "నామంట చూసినట్టే!" అని తల్లి వొట్టుపెట్టుకోవడంవల్ల, గత్యంతరం లేక యిలా వొచ్చిపడ్డాడు రాజారావు.

"పోదూ, రెండురోజులు యిక్కడే వుండి, తిరుపతి వెళ్ళి వచ్చాననని అమ్మకి నమ్మకంగా చెప్పు. ఊళ్ళో మంచి సినీమాలు చాలా వున్నాయి! హాయిగా సినీమాలు చూదాం, అంది శాంతా దేవి.

"ఇప్పుడు యిలాగే అంటావ్. తర్వాత ఎప్పుడో టుపుక్కున అమ్మతో అనేస్తావ్. మధ్యని ఫూల్ అయేది నేను. ఏడాదిక్రితం నాకు టైఫాయిడ్ వచ్చినప్పుడు అమ్మకి కలలో వెంకటేశ్వరస్వామి కనిపించాడట."

"అమ్మమీాద తోస్తావుగాని నీకూ దైవభీతి ఉందిలే!" అంది శాంతా దేవి.

అది తప్పుకాదుగా! నిజానికి రాజారావుది దైవభీతి కాదు. దొరికిపోయే అబద్ధాలు చెప్పడం అతనికి యిష్టం లేదు. అతని అబద్ధాలు తడికలలాగానూ, గోడలలాగానూ గాక పర్వతాల్లా ఉంటాయి.

శాంతా దేవిని అతికష్టంమీాద తిరుపతి ప్రయాణానికి వొప్పించాం. ఆ రాత్రి 'కాసినో' కి వెళ్ళి మర్నాడుదయం ఎక్స్‌ప్రెస్‌కి వెళ్దామంది. ఆవిడ ఆమోదించడమే పదివేలను కున్నాడు రాజారావు, తన కొడుకు హైదరాబాద్ వెళ్ళి

తిరుపతి వెళ్ళివచ్చానని చెప్పే ప్రబుద్ధుడని రాజారావు తల్లికి తెలుసు; అందుకని కూతురిని సాక్ష్యంగా తీసుకు వెళ్ళమంది. శాంతాదేవిది మోతుబరి సాక్ష్యం; అందుకనే, రాజారావు ఆమె రావాలని అంతగా ప్రాధేయ పడ్డాడు.

♦ ♦ ♦

ఆహా! తిరుపతి చూశాం. 'ఎంతని నేవర్ణింతునే' పాడనా, అని అడిగింది శాంతాదేవి, కొండ దూరానికి కనిపిస్తూవుండగా. కంపార్టుమెంటులోని యితరుల క్షేమం ఆలోచించి, వొద్దన్నాము.

రైలు రైలూ తిరుపతి స్టేషన్‌లో ఖాళీ అయిపోయింది. యాత్రీకుల భాషలో దానిని దిగువ తిరుపతి అంటారు. మేము రైలు దిగేటప్పటికి పన్నెండు కావచ్చింది. పన్నెండు నుంచి మూడు గంటలదాకా దేవస్థానపు సత్రం వరండాలో కూచున్నాం. ఆమూడు గంటలూ శాంతాదేవి రాజారావుని నమిలి మింగేసేటట్టు చూసింది. పాపం, అతనికి మాత్రం తెలుసా యిక్కడి ఆచార వ్యవహారాలు?

మాకిచ్చిన గది వసతిగానే ఉంది. దగ్గర్లోనే కుళాయి ఉంది. ఎవరో అబ్బాయి సామానులు తీసుకువచ్చి యిచ్చాడు. సాయంత్రం అయిదున్నరకి కాస్త మనుష్యుల్లో పడ్డాము.

"అలిమేలుమంగని చూడరూ?" అన్నారు మా వెనక నించి ఎవరో.

"ఆవిడెవరు?" అంది శాంతాదేవి.

జట్కాబండి కట్టించుకు వెళ్ళి, ఆ అమ్మవారిని చూసి వచ్చేటప్పటికి, మా వొళ్ళు హూనం హూనం అయింది. ఆ రాత్రి భోజనాల వేళ శాంతాదేవి నేతిలోని గండుచీమల్ని లక్ష్యపెట్టలేకుగాని సాంబారులోని బొద్దెంకని చూసి జడుసుకుంది.

“బొద్దెంకేగదా, ఫరవాలేదు. నిన్న నాకు బల్లివచ్చింది” అన్నాడు మా కెదురుగా కూచున్న ఆసామీ.

గదిలోకి వచ్చిన తర్వాత శానిటరీ డిపార్టుమెంటుమీద చాలా ఘట్టిగా మాట్లాడుకున్నాం ముగ్గురమూను. అలిమేలు మంగని చూడమన్న కంఠమే “బస్సు టిక్కెట్లు దొరికాయా?” అని అడిగింది. హడావిడిగా పరుగెత్తి అడగవలసినవాళ్ళని అడిగాము. ఇంకో రెండు రోజులుదాకా దొరకవన్నారు. నడుద్దామంటే నడుద్దామని తీర్మానించుకున్నాము.

నాలుగు గంటలకి కొండ ఎక్కడం మొదలెట్టాము. మోకాళ్ళ పర్వతం ఎక్కిన తర్వాత శాంతాదేవి తన కాళ్ళు తను పిసుక్కుంటూ కూచుంది.

పావుగంట విశ్రాంతి తీసుకు మళ్ళీ నడక సాగించాము. శాంతాదేవి కూడా జన ప్రవాహంలో పడిపోయింది. తన పట్నవాసం, తన యింగ్లీషు చదువూ మర్చిపోయింది. భారత దేశంలోని మూల మూలల ప్రజలని ఆకర్షించే ఆ కొండ వైపు, తనుకూడా ఆకర్షింపబడుతూ వెళ్ళిపోయింది. ఒక

చేతిలో అన్నగారి చెయ్యీ ఒక చేతిలో నా చెయ్యీ గొలుసు కట్టుగా పట్టుకుని, అందరితో పాటు అల్లరికి 'గోవిందా' అని అరిచినప్పుడు 'ఎంకి' జ్ఞాపకం వొచ్చి రాజారావూ, నేనూ ఆశ్చర్య పడేవాళ్ళం. "అరవండి-మీరు కూడా అరవండి, Be a Roman in Rome" అనేది మాతో.

కొండ ఎక్కాక ఆమె కాలిజోళ్ళు చాలామంది కళ్ళ బడ్డాయి. ఆమె జోళ్ళనే యేమిటి, మా జోళ్ళు కూడాను. ఒకతను వొచ్చి, "జోళ్ళు తియ్యండి, జోళ్ళు తియ్యండి" అన్నాడు.

"తీసి, ఏం చెయ్య మన్నావ్! చెవులకి కట్టుకో మంటావా? దేవుడి గుళ్ళోకంటే రాగూడదుగాని..."

"ఊరుకో అమ్మా ఊరుకో. మహా చెప్పొచ్చావ్. తెల్ల గవర్నరే జోళ్ళు దిగువ తిరుపతిలో వొదిలి వచ్చాడు!"

ఛెళ్ళున చెంపమీద కొట్టినట్టయింది శాంతా దేవికి. అంత పొగరుమోతు మనుషుల్ని మేమెక్కడా చూడలేదు.

జోళ్ళవాడు వెళ్ళిపోగానే, తల నీలాలు అంటూ యింకొకడు ప్రత్యక్షమయాడు. మేము నవ్వుకుంటూ వుండగా 'రండి. స్నానం చేదురుగాని' అంటూ మరొకతను తయారయాడు.

అక్కడి పసరుకోనేట్లో మేము మునగ లేదు; పాప వినాశనమ్‌కి వెళ్ళ లేదు; మా వాడు పనులన్నీ పావుగంటలో పూర్తి చేశాడు. దేవస్థానం హోటల్లో యిడ్లీ వడా తిని, కాఫీ

తాగాము. మా కింక అక్కడ ఏమి చెయ్యాలో తోచలేదు. అమాయకులైన యాత్రీకుల్ని మినహాయిస్తే అక్కడవున్న ప్రతివాడూ తనేదో భగవంతుడి ప్రతినిధిలా, 'మీ విషయం దేవుడిగారికి సిఫారసు చేస్తానులే' అన్నట్టు పోజు పెట్టేవాడే!

ఎండగా ఉండటంచేత వస్తున్నప్పుడు రెండెడ్లబండి కట్టించుకు దిగాము. కాళ్ళు పీక్కుపోతున్నాయని శాంతాదేవి మహాబాధ పడింది.

“ఏ దేవుడికయినా మొక్కుకోగాని, తిరుపతి దేవుడికి వొద్దని అమ్మకి చెబుతాను”అన్నాడు రాజారావు మమ్మల్ని నవ్వించేందుకు.

మూడో రోజు పుదయం మేము మద్రాస్-వచ్చేటప్పటికి వారం రోజులు జబ్బుపడ్డ వాళ్ళలా అయాము.

* * * *

ఆ సాయంత్రం ముకుందంగారువచ్చి 'తిరుపతి వెళ్ళారటగా !'అని అడిగారు.

“అవునండి” అంది శాంతాదేవి.

“మీకు తిరుపతి నచ్చిందా !”

“ఆ...ఏం నచ్చడం గాని, అక్కడి మనుషులకంటె కోతులు బావుంటాయి. తిరుపతి స్థల మహాత్యం కోతులవల్ల కలిగిందిగాని మనుషులవల్ల మట్టుకు కాదు”అంది శాంతాదేవి.